క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం: మండలంలోని చిద్నెపల్లి గ్రామపంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ అంతర్గాం రాజమౌళి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా రాజమౌళి గతంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరి తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో పని చేయాలనే తపనతో పార్టీలో చేరినట్లు రాజమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ రంగాల్లో నైపుణ్యత పెంపొందించడానికి ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి క్రాంతి కిరణ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 12 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోని దరఖాస్తు ఫారాలను జూలై 14లోపు జిల్లా కార్యాలయంలో అందించాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

మల్హర్: భూసార పరీక్షలతో రైతులకు మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి శ్రీజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు నూతన సాంకేతిక పద్ధతును అందిపుచ్చుకోని వ్యవసాయం చేయాలని తెలిపారు. సాగు చేసే ముందు భూముల్లో పరీక్షలు చేయించుకోని రిపోర్టు ఆధారంగా అనువైన పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఆధికారుల ఆదేశాల మేరకు వల్లెకుంట, తాడిచర్ల గ్రామాల్లో 125 మంది రైతుల సంబంధించిన భూముల నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థి శాన్వి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి కోల శాన్వి స్పోర్ట్స్ స్కూల్స్ ప్రవేశం కోసం రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనేందుకు ఎంపికైనట్లు హెచ్ఎం పెంటి శ్యామ్ శనివారం తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పోర్ట్స్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. మారుమూల గ్రామానికి చెందిన బాలిక రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కమిటీల ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న రమేశ్

మల్హర్: మండలంలోని మల్లారం, ఇప్పలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్, మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ ఆధ్వర్యంలో శనివారం పార్టీ నూతన గ్రామ కమిటీలను నియామించారు. మల్లారం గ్రామ శాఖ అధ్యక్షుడిగా భూక్య రాజునాయక్, ఉపాధ్యక్షుడిగా దేనవేన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పొల్సాని రవీందర్ రావును ఎన్నుకున్నారు. అలాగే ఇప్పలపల్లి అధ్యక్షుడిగా లింగం స్వామి, ప్రధాన కార్యదర్శిగా గొరిచెట్టి నవీన్, కోశాధికారిగా పెనుగొండ మహేశ్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీలకు నాయకులు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరేడుగొమ్మ రాజేశ్వర్ రావు, అవిర్నేని ప్రకాశ్‌రావు, అవిర్నేని రూపేష్ రావు, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా మృతి



సహజ(ఫైల్)

పలిమెల: అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా కేదారి సహజ (38) మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు.. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో పని చేస్తున్న కేదారి సహజ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆస్పత్రికి వెళ్లేందుకు ఆమె తల్లిగారింటికి ములుగు జిల్లా వాజేడు మండలం దూలపల్లికి శుక్రవారం వెళ్లింది. కాగా, శనివారం ఆరోగ్యం విషమించడంతో ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తుండగా మృతి చెందింది.

చినుకు పడితే కుంటలే..

రహదారులపై నిలుస్తున్న వర్షపు నీరు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రహదారిపై నిలిచి ఉన్న నీరు



బురదమయంగా మారిన రోడ్డు

గణపురం: మండల కేంద్రంలోని పరకాల–ములుగు ప్రధాన రహదారిపై వర్షం పడితే నీరు నిల్వ ఉండి కుంటలుగా మారుతున్నాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నీరు నిల్వ ఉన్న చోట ద్విచక్రవాహనదారులు జారీ కింద పడిపోతున్నారు. భారీ వాహనాలు వెళ్లినప్పుడు ప్రజలు రోడ్ల వెంట వెళ్తుంటే నీరు వారిపై చిమ్మి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు బురదమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్న, ప్రజలు ఇబ్బంది పడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్లను మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుపైనే నీరు



రోడ్డుపై నిలిచిన నీరు

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి బస్‌స్టాండ్ వద్ద తారు రోడ్డును ఇటీవల వేశారు. కాగా నాణ్యత లోపంతో ఒక్క వర్షానికే కొట్టుకపోయింది. దీంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు త్వరితగతిన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

కల్వర్టుపై నిలిచిన నీరు



ములకలపల్లి కల్వర్టు వద్ద నిలిచిన వర్షపు నీరు

మొగుళ్లపల్లి: మండలంలోని ములకలపల్లి–మొగుళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ కల్వర్టు వద్ద ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలవడంతో వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏడు నెలల క్రితం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ములకలపల్లి–మొగుళ్లపల్లి, ఏల్లారెడ్డి పల్లి, పిడిసిల్ల గ్రామాల మధ్య లోలెవల్ బ్రిడ్జీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ ఇంత వరకు పనులు ప్రారంభించకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద త్వరగా బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాని పలువురు కోరుతున్నారు.

ప్రజా ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యం



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంజూర్‌నగర్‌లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో అదనపు తరగతి గదులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని పట్టుదలతో గమ్యం చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు రెడ్డి కాలనీలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీలోని కాలనీ వాసులు అన్ని వార్డుల్లో దొంగతనాలు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- పీహెచ్‌సీ వైద్యాధికారి మధుకర్



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ మధుకర్

వాజేడు : వర్షాకాలంలో ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మధుకర్ అన్నారు. శనివారం నాగారంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి మందులను ఇచ్చారు. ఇంటింటికి తిరిగి అనారోగ్యంతో ఉన్న వారికి మందులను పంపిణీ చేయడంతో పాటు రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధుకర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చి కున్‌గున్యా వంటి విష జ్వరాలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను తెలిపారు. దోమలను అరికడితే జ్వరాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారం ఖాయం



శ్రీనివాస్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారాయణరెడ్డి

కాటారం: రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఆదివారంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని పరికిపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ముక్కల్ల శ్రీనివాస్ శనివారం బీజేపీలో చేరారు. మండల అధ్యక్షుడు పాగె రంజిత్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి శ్రీనివాస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు, వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు సొంత మండలం కాటారంలో ఒక పరిశ్రమ ఏర్పాటు చేయలేకపోయారని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్‌సెన్సార్ బోర్డు మెంబర్ దుర్గం తిరుపతి, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మన భాస్కర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ రఫీ, శ్రీశైలం, ఎరుకల రాజయ్య, బండి రమేశ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సర్వసాధారణం

- ఎంపీడీఓ బద్రు

మంగపేట : ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది సర్వసాధారణమని ఎంపీడీఓ బద్రు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పర్యవేక్షకులు(సూపరింటెండెంట్)గా విధులు నిర్వహిస్తున్న అలేటి సుదర్శన్ ఉద్యోగ విరమణ అభినందన సన్మానసభ కార్యాలయ సమావేశపు గదిలో బద్రు అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమానికి కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆయన మిత్రులు. పలువురు ఉద్యోగులు పాల్గొని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మొమెంటోలతో సత్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సుదర్శన్ పంచాయతీ రాజ్ శాఖలో 39 ఏళ్లు వివిద హోదాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన జీవితం సుఖ సంతోషాలతో కొనసాగించాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, తెలంగాణ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బర్మవత్ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు పోతురాజు నాగేశ్వర్‌రావు శాలువాతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓ చేరాలు, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, సబార్డినేట్ భద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే చర్యలు

- ట్రాన్స్‌కో డీఈ పాపిరెడ్డి



అవగాహన కల్పిస్తున్న డీఈ పాపిరెడ్డి

కాటారం: విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే చర్యలు తప్పవని ట్రాన్స్‌కో డీఈ పాపిరెడ్డి అన్నారు. మండలంలోని బొప్పారం ఎస్సీ కాలనీలో సందర్శించి కాలనీవాసులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మీటర్ అమర్చుకోవాలని అక్రమంగా విద్యుత్‌ను వినియోగించడం నేరమని సూచించారు. విద్యుత్ బిల్లులను సక్రమంగా చెల్లించాలని తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్‌పై జాగ్రత్తగా ఉండాలని ఏవైన సమస్యలు ఉంటే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. డీఈ వెంట ఏఈఈ ఉపేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన అల్లం అయిలయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం పరామర్శించి ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు ఉన్నారు.

చల్లగరిగలో..

మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన పందుల రామక్క ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసుదనాచారి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. తిర్మాలాపూర్ గ్రామానికి చెందిన కంచర్ల పోషాలు మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మండల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నవాబుపేటలో..

మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన ఎండీ. హకీమ్‌పాషా , కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశీధర్‌రెడ్డి పరామర్శించారు. అలాగే చల్లగరిగకు చెందిన పందుల రామక్క, మండల కేంద్రానికి చెందిన అల్లం అయిలయ్యలు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల నాయకులు ఉన్నారు.

చిన్నారి చేరదీత



శ్రీజను పాఠశాలలో చేర్పిస్తున్న మారుతి

భూపాలపల్లి రూరల్: తల్లి వదిలేయడం, తండ్రి మద్యానికి బానిస కావడంతో చిన్నారి శ్రీజ చదువు మానేసి ఒకరి ఇంట్లో పని మనిషిగా పని చేస్తుంది. దీంతో ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి శ్రీజను చేరదీసి పాఠశాలలో చేర్పించారు. వివరాల్లోకి వెళ్లితే.. భూపాలపల్లి మండలం గూడాడుపల్లి గ్రామానికి చెందిన దాసరపు శ్రీజను చిన్నతనంలోనే వాళ్ల అమ్మ వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తండ్రి మానసికంగా కృంగిపోయి మద్యానికి బానియ్యాడు. దీంతో శ్రీజను పట్టించుకునే వాళ్లు లేకపోవడంతో స్కూల్ మానేసి వేరే ఊరిలో ఒకరి ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తూ ఉండిపోయింది. శ్రీజ పరిస్థితిని గూడాడుపల్లికి చెందిన చంద్రగిరి శ్రీకాంత్ అనే యువకుడు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతికి చెప్పడంతో వెంటనే స్పందించిన ఆయన ఆ చిన్నారి దగ్గరికి వెళ్లి బట్టలు, బుక్స్ పెన్నులు, సామను కొనిచ్చి చిట్యాల కస్తూర్బా హాస్టల్‌లో శుక్రవారం జాయిన్ చేయించాడు. అలాగే శ్రీజ పూర్తి బాధ్యతలు తామే చూసుకుంటామని పైచదువులకు కూడా సహాయం అందిస్తామన్నారు. అలాగే భవిష్యత్‌లో ఆమె పెళ్లి బాధ్యతలు కూడా తీసుకుంటామని మారుతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చిట్యాల మండల ఇన్‌చార్జ్ లౌడియ రాజునాయక్, దుగ్యాల స్వామి తదితర సభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు

- సీఐ అనుముల శ్రీనివాస్

ఏటూరునాగారం : గొత్తికోయగూడేల్లోని ప్రజలు అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వీరాపురం గొత్తికోయ గుంపులో ఉన్న గిరిజనులకు వర్షాకాలం సందర్భంగా రెయిన్‌కోట్ కవర్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు అన్నారు. ఎవరైనా గూడేనికి పరిచయం లేని వ్యక్తులు వస్తే ఆశ్రయం ఇవ్వడం, సాయం చేయడం చేయరాదన్నారు. గిరిజనులు వర్షాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సంతోష్, భార్గవ్, కానిస్టేబుళ్లు శోభన్, గోపి, విక్రమ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతో కేజీబీవీ ఆదర్శం

- ఐదేళ్ల నుంచి పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత
- 60 మందితో ప్రారంభం.. నేటికి 215కి చేరిన విద్యార్థులు
- ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్న సిబ్బంది



ముప్పనపల్లిలోని కేజీబీవీ భవనం

కన్నాయిగూడెం : మండలంలోని ముప్పనపల్లి వద్ద ఏర్పాటు చేసిన కేజీబీవీ పదిలో ఉత్తమ ఫలితాలతో ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందిండమే లక్ష్యంతో కేజీ టు పీజీ విద్యలో భాగంగా మండలానికో కేజీబీవీని మంజూరు చేసి 2016లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. అప్పుడు ఆరో తరగతితో ప్రారంభించి 2000లో పదో తరగతికి అప్‌గ్రేడ్ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ జిల్లానే మంచి గుర్తింపుతో ముందుకు సాగుతుంది. దీంతో ఈ పాఠశాలలో చేరడానికి విద్యార్థులు ముందుకొస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..

మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పాఠశాల యుజమాన్యం ముందుకు వెళ్తూ ప్రణాళికతో పరీక్షలకు నాలుగు నెలల ముందు నుంచే ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ఆ దిశగా అడుగులు వేస్తుంది. 2000–21లో 9 మంది, 2021–22లో 13 మంది, 2022–23లో 11 మంది, 2023–24లో 13 మంది, 2024, 2025లో 19 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది. ప్రస్తుతం 2025 అకాడమిక్‌లో పదో తరగతి వరకు 180 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా 2025లో కేజీబీవీని ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ఇంటర్‌లో 35 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు ప్రత్యేక అధికారి అశ్విని తెలిపారు.

ప్రత్యేక క్లాస్‌లు

పదిలో మంచి ఫలితాలు రావాలని అధికారుల ఆదేశాలతో ముందు నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షలకు ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేసి ప్రతీ పాఠ్యాంశాలను రెండు మూడు సార్లు వివరిస్తూ ప్రతీ విద్యార్థికి అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఇంకా మెరుగైన వసతులు కల్పిస్తే జిల్లాలోనే మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉండొచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అర్థమయ్యేరీతిలో బోధించారు..



ప్రతీ తరగతిలో మాకు మా మేడంలు అర్థమయ్యేరీతిలో బోధించారు. డౌట్ వస్తే మళ్లీ చెప్పేవారు. చదువులో కొద్దిగా వెనుకబాటులో ఉండే పిల్లలపై ప్రత్యేక చొరవ చూపేవారు. వారి సలహా లు, సూచనలతోనే నేను మండల టాపర్‌గా నిలిచాను.

– బుద్దె వైష్ణవి, 2025లో మండల టాపర్

ఉపాధ్యాయులే మార్గదర్శకులు



మాకు ఉపాధ్యాయులే మార్గదర్శకులుగా నిలిచారు. పదిలో ప్రత్యేక క్లాస్‌లు చెప్పి ప్రతీ దానిపై మాకు పూర్తి అవగాహన అచ్చేవిధంగా బోధించేవారు. 6 నుండి 10 వరకు కేజీబీవీలోనే చదివి మండల టాపర్‌గా మార్కులు సాధించాం.

– కుందారపు శిదాణి, 2024లో కన్నాయిగూడెం మండల టాపర్

సిబ్బంది కృషితోనే ఫలితాలు



కేజీబీవీలో విద్యార్థులకు బోధన చేసే ప్రతీ ఉపాధ్యాయుడి కృషి చేయడంతోనే మంచి ఉత్తమ ఫలితాలు సాధించగల్గుతున్నాం. ప్రభుత్వం మంచి వసతి, భోజనం విశాలమైన తరగతి గదులు కల్పించింది. పది విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికతో బోధన చేస్తున్నాము.

– అశ్విని, పాఠశాల ప్రత్యేక అధికారిణి

పడిపోయిన సూచిక బోర్డు..



పొలంలో పడిపోయిన సూచిక బోర్డు

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామ శివారులోని సూచిక బోర్డు కింద పడిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిగుండా నిత్యం ప్రజలు కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి, జాకారం, ములుగు వంటి ప్రాంతాలకు వెళ్తుంటారు. మలుపుల వద్ద సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పొలంలో పడిపోయిన సూచిక బోర్డును సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.